సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ; 11 ; మార్చి ; 2023



చీనీ టన్ను రూ.36 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు ధర పలికాయి. మార్కెట్‌కు 708 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.21
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.21, కనిష్టంగా రూ.4.50, సరాసరిన రూ.9 మేర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
35.9°/10.7°
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో గాలివేగం పెరిగింది. గంటకు 6 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

తాగునీటి తిప్పలుండవు!

వేసవి వచ్చిందంటే గుక్కెడు నీటి కోసం గ్రామీణులు అల్లాడేవారు. బోర్లు పనిచేయక కి.మీ దూరం వెళ్లి పొలాల నుంచి తాగునీళ్లు తెచ్చుకునేవారు. కానీ ఈ వేసవిలో జిల్లాలో అలాంటి పరిస్థితులు ఉండవు. వరుణుడి కరుణతో చెరువుల్లో పుష్కలంగా నీరుండగా, భూగర్భ జలమట్టం బాగా పెరిగింది. అయినప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. భూగర్భ జలమట్టం కాస్త అటూఇటుగా ఉన్న 42 గ్రామాలను ఎంపిక చేసుకుని ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తితే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ఇప్పటికే ఓ ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం రూ.42.60 లక్షలతో ప్రాథమిక అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు.

- ముందస్తు చర్యలు చేపట్టిన గ్రామీణ నీటిపారుదల శాఖ
- ఏప్రిల్ నుంచి అందుబాటులోకి హెల్ప్ లైన్ నంబర్
- ముందస్తు చర్యల్లో భాగంగా 46 గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- రూ.42 లక్షలతో ప్రతిపాదనలు పంపిన అధికారులు



వీరంతా పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లి అటవీ గ్రామ ప్రజలు. నాలుగేళ్ల క్రితం తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. చెరువు ఎండిపోయి పంచాయతీ బోర్లు పనిచేయక కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయబోర్ల నుంచి ఇలా తాగునీరు తెచ్చుకునే వారు. ప్రకృతి కరుణించడంతో చెరువులన్నీ నిండాయి. ప్రభుత్వం కూడా భూగర్భ జలాలు పెంపునకు తగు చర్యలు చేపట్టింది. దీంతో బోర్లన్నీ రీచార్జ్ కాగా, ప్రస్తుతం గ్రామంలోని కుళాయిల్లోనే సమృద్ధిగా నీళ్లు వస్తున్నాయి. దీంతో గంగిరెడ్డిపల్లిలో తాగు నీటి కష్టాలు పూర్తిగా తీరాయి.



సాక్షి, పుట్టపర్తి: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ శాఖలతో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సమన్వయం చేసుకుని నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వచ్చే జూన్ వరకు

12	నీటి ఎద్దడి ఏర్పడే అవకాశమున్న మండలాలు
46	నీటి ఎద్దడి ఏర్పడే అవకాశమున్న గ్రామాలు
రూ.42.60 లక్షలు	అధికారులు వేసిన ప్రాథమిక అంచనాలు

ఎలాంటి నీటి సమస్య రాకుండా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టారు. ఇందుకోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో 12 మండలాల పరిధిలో 46 గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నట్లు గుర్తించారు.

ఈసారి తక్కువగానే..

గతంతో పోల్చితే ఈ ఏడాది జిల్లాలో నీటి ఎద్దడి తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉంది. గతేడాది వర్షాకాలంలో సమృద్ధిగా వరుణుడు కరుణించాడు. ఫలితంగా చెరువులు నిండాయి. భూగర్భ జలాలు పెరిగాయి. ఎక్కడ చూసినా నిండుకుండలను తలపిస్తూ కాలువలు, చెరువులు, నదులు పొంగి పొర్లుతుండటంతో ఉపశమనం లభించనుంది. గతంలో మాదిరిగా ట్యాంకర్లతో సరఫరా చేసే పరిస్థితి రాకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ముందస్తు చర్యలు..

జిల్లా వ్యాప్తంగా అగళి, అమడగూరు, అమరాపురం, చిలమత్తూరు, గాండ్లపెంట, గుడిబండ, హిందూపురం, లేపాక్షి, ఎన్‌పీ కుంట, రొద్దం, రొళ్ల, తనకల్లు మండలాల పరిధిలో 46 గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యల కోసం రూ.42.60 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. ఏప్రిల్ నుంచి ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నంబరునూ అందుబాటులోకి తీసుకురానున్నారు.

46 గ్రామాలు ఇవే..

హులికెరదేవరపల్లి, మధూడి, పి.బ్యాడిగెర, రావుడి, కరినిరెడ్డిపల్లి, లోకోజిపల్లి, తమ్మాడిహళ్లి, దేమకేతేపల్లి, హుస్సేన్‌పురం, చామచేనుబైలు, చామలగొండి, గాండ్లపెంట, జీనులకుంట, కురుమామిడి, మడుగువానిగొంది, సోమయాజులపల్లి, గుణేమోరుబాగల్, కేకాతి, ఎస్.రాయపురం, దేవరపల్లి, గొల్లాపురం, కిరికెర, కొటిపి, కొట్నూరు, మణేసముద్రం, శ్రీకంఠపురం, చోళ సముద్రం, ఎదురుదొణ, గూటిబయలు, ముదుపులజూవి, చెరుకూరు, బొమ్మగుండనహళ్లి, దొడ్డేరి, కాకి, ఎం.రాయపురం, రొళ్ల, అగ్రహారంపల్లె, బాలసముద్రం, బొంతలపల్లి, చీకటిమానిపల్లి, దిగువమండలపల్లి, గుర్రంబయలు, కోటపల్లి, మద్దినాయునిపాలెం, టి.సదుం.

ప్రతిపాదనలు పంపించాం



ఫిబ్రవరి, మార్చి నెలల్లో అధికారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాల్సి ఉంటుంది. ప్రతి గ్రామం, ప్రతి బోరు పరిశీలించాలి. ఇవన్నీ పూర్తి కావడానికి మరో 15 రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా నీటి సమస్య లేదు. ఏప్రిల్ నుంచి హెల్ప్ లైన్ నంబరు ఏర్పాటు చేస్తాం. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో సమస్య నివారణ కోసం 123 పనులకు గానూ రూ.42.60 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం.
– రషీద్‌ఖాన్, జిల్లా గ్రామీణ నీటిపారుదలశాఖ అధికారి

న్యూస్‌రీల్

బీటెక్, బీఫార్మసీ ఫలితాలు విడుదల


జేఎన్‌టీయూ పరీక్షల విభాగం

అనంతపురం: అనంతపురం జేఎన్‌టీయూ పరిధిలో ఫిబ్రవరిలో నిర్వహించిన బీటెక్ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్16) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య కేశవరెడ్డి, కంట్రోలర్ ఆచార్య చంద్రమోహన్ రెడ్డి ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్19), బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్15), బీఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్19) సప్లిమెంటరీ, బీఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ, బీఫార్మసీ రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్ http://jntuaresults.ac.in ను సంప్రదించాలని సూచించారు.

19 ఏళ్లలోపు వారందరికీ 'ఆల్బెండజోల్' ఇవ్వాలి

- డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి


ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: రక్తహీనతను నివారించడం కోసం జిల్లాలోని 19 ఏళ్ల లోపు వయస్సున్న వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నులి పురుగుల వల్లే చిన్నారులు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వీటి నివారణకు 1–19 ఏళ్ల మధ్య వయస్సున్న వారందరికీ 400 ఎంజీ ఆల్‌బెండజోల్ మాత్రలను మధ్యాహ్న భోజనం తర్వాత ఇవ్వాలన్నారు. ఈనెల 14, 18 తేదీల్లో స్కూళ్లు, కళాశాలలతో పాటు ఇంటింటికీ తిరిగి మాత్రలను అందజేయాలన్నారు. అలాగే చేతిశుభ్రత గురించి వివరించారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ జోత్స్న, డాక్టర్ నాగదుర్గ, సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్‌ఎన్ లలిత కుమారి తదితరులు ఉన్నారు.

గంజాయి కేసులో ఆరుగురికి జైలు



పుట్టపర్తి అర్బన్/తనకల్లు: తనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన గంజాయి కేసులో ఆరుగురు ముద్దాయిలకు ఏడాది శిక్ష పడింది. ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ తెలిపిన వివరాల మేరకు... 2017లో కొక్కంటిక్రాస్ సమీపంలో గంజాయి తరలిస్తూ నలుగురు వ్యక్తులు పట్టుబడగా, పోలీసులు వారి నుంచి 8 కిలోల గంజాయితో పాటు రూ. 5,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసుతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు శుక్రవారం అనంతపురం మొదటి ఏడీజే కోర్టులో తుది విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో జడ్జి... నిందితులైన భాగ్యమ్మ, పఠాన్ రహంతుల్లా, లక్ష్మీదేవి, నారాయణస్వామి, మల్లెల రమేష్, మల్లెల శ్రీనివాసులుకు ఏడాది జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. మరొకరిని నిరపరాధిగా భావించి వదలిపెట్టారు. నిందితులకు శిక్ష పడేలా కేసు నడిపించిన సీఐ మన్సూరుద్దీన్, ఎస్‌ఐ హారున్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్, స్పెషల్ పీపీ లక్ష్మీనారాయణలను ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ అభినందించారు. జిల్లాలో గంజాయి రవాణా, వినియోగంపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. గంజాయిని స్వీకరించినా, రవాణా చేసినా పీడీ యాక్ట్ నమోదు చేసి జిల్లా బహిష్కరణ చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

'పట్టభద్రుల' బ్యాలెట్ పేపర్లూ వచ్చేశాయ్


పట్టభద్రుల ఎమ్మెల్సీ బ్యాలెట్ పేపర్లను ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్లు అనంతపురం చేరాయి. జిల్లాల వారీగా ఓటర్ల సంఖ్య మేరకు బ్యాలెట్ పేపర్ల ప్యాకింగ్ ప్రక్రియను ఎన్నికల సిబ్బంది శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో చేపట్టారు. పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో మొత్తం 3,30,124 మంది ఓటర్లు ఉన్నారు. అనంతపురం జిల్లాలో 68,341 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 43,310 మంది, కర్నూలులో 62,633 మంది, నంద్యాలలో 54,929 మంది, వైఎస్సార్‌లో 81,317 మంది, అన్నమయ్య జిల్లాలో 20,594 మంది ఓటర్లు ఉన్నారు.

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్లను ఇప్పటికే జిల్లాల వారీగా ప్యాకింగ్ చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచారు. ఉపాధ్యాయ నియోకవర్గం పరిధిలో మొత్తం 28,148 మంది ఓటర్లు ఉన్నారు. అనంతపురం జిల్లాలో 5,564 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 348 మంది, కర్నూలులో 5,391 మంది, నంద్యాలలో 4,426, వైఎస్సార్‌లో 7,461 మంది, అన్నమయ్య జిల్లాలో1,958 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లను బందోబస్తుతో శనివారం ఆయా జిల్లాలకు పంపించనున్నారు.

19న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు



కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19న స్కూల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆక్టివిటీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి రామచంద్ర తెలిపారు. అండర్ 14, 16, 19 విభాగాల్లో క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, కరాటే, టెన్నిస్, త్రోబాల్, కరాటే, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 19వ తేదీ ఉదయం ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని క్రీడా మైదానం వద్దకు రావాలని సూచించారు. వివరాలకు 8374775227 నంబర్లో సంప్రదించవచ్చన్నారు.

మోహినీ రూపాయా.. ఖాద్రీశా

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం ఖాద్రీశుడు కుచ్చుల వాలు జడతో మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చంకన అమృత భాండాగారంతో సుకుమార వేషంలో కనిపించిన శ్రీవారిని దర్శించుకుని భక్తులు తరించారు. ధగధగ మెరిసే పట్టు చీరలో అందరినీ ఆకట్టుకొనే స్వామివారిని కదిరి మల్లెలతో అలంకరించారు. ఉభయదారులుగా పట్టణానికి చెందిన కోటా వెంకట సుబ్బయ్య శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ ఏసీ పట్టెం గురుప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. తిరువీధుల దర్శనానంతరం స్వామివారు ఆలయానికి రాలేకపోతున్న భక్తుల ఇళ్ల వద్దకే వెళ్లి దర్శనమిచ్చారు. ఈ క్రమంలో రాత్రంతా పట్టణంలోని ప్రతి వీధిలోనూ ఊరేగారు.


మోహినీ అవతారంలో లక్ష్మీ నారసింహుడు


ఖాద్రీశుడి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తజనం

మహిళా సాధికారతకు కృషి చేద్దాం

- మహిళా దినోత్సవంలో ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్

పుట్టపర్తి అర్బన్: మహిళా సాధికారతతోనే మెరుగైన సమాజం సాధ్యమని, అందువల్ల ప్రతి ఒక్కరూ మహిళా సాధికారతకు కృషి చేయాలని ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కదిరి డీఎస్పీ భవ్యకిశోర్‌తో పాటు ఎస్పీ కార్యాలయ సిబ్బంది, ఏఆర్ విభాగంలోని మహిళా కానిస్టేబుళ్లను, మహిళా హోంగార్డులతో కేక్ కట్ చేయించి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ మాట్లాడుతూ... స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలమన్నారు. విద్య, వైద్య రంగాలతో పాటు పోలీసు శాఖలోనూ మహిళల పాత్ర పెరగిందని, చివరకు అంతరిక్షంలోనూ మహిళలు రాణిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సమానత్వం అనేది ఇంటి నుంచే మొదలు కావాలని, తల్లిదండ్రులు కుమారుడితో సమానంగా కుమార్తెకూ సమాన అవకాశాలు కల్పించి వారి అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. అనంతరం గత ఏడాది జూలైలో అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు చెండ్రాయుడు కుటుంబానికి యాక్సిక్ బ్యాంకు ద్వారా అందిన ప్రమాద బీమా కింద అందిన రూ.3 లక్షల చెక్కును ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.


కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న జిల్లా పోలీస్ అధికారులు

పోలింగ్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు

- ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అధికారులకు కలెక్టర్ ఆదేశం
- పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన
- సౌకర్యాలపై ఆరా


శిక్షణలో పాల్గొన్న పీఓలు, ఏపీఓలు, జోనల్ ఆఫీసర్లు


కనగానపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పొరపాట్లకు తావివ్వొద్దని, చిన్న తప్పు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ బసంత్‌కుమార్ పోలింగ్ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం పుట్టపర్తి పట్టణంలోని సాయిఆరామంలో నిర్వహించిన రెండో విడత శిక్షణ తరగతుల్లో భాగంగా పీఓలు, ఏపీఓలు, జోనల్ ఆఫీసర్లకు జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఈసీ రూపొందించిన పోలింగ్ సరళి, విధి విధానాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో పీఓలు, ఏపీఓలు, జోనల్ ఆఫీసర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. పోలింగ్ రోజున తాను, ఎస్పీ అందుబాటులో ఉంటామని, ఎలాంటి సందేహం వచ్చినా వెంటనే సంప్రదించాలన్నారు. హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా చదివి విధులు నిర్వర్తించాలన్నారు. జేసీ చేతన్ మాట్లాడుతూ... 13వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ఉంటుందన్నారు. 12వ తేదీ ఉదయం 7 గంటల నుంచి డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. సుమారు 30 రకాల మెటీరియల్ తీసుకొని చెక్ లిస్ట్ ప్రకారం చెక్ చేసుకోవాలన్నారు. రూట్ ఆఫీసర్లు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరియల్ అధికారులు, జోనల్ ఆఫీసర్లు పోలీస్ యంత్రాంగం సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, నోడల్ ఆఫీసర్లు చంద్రమౌళిరెడ్డి, నరసయ్య, మాస్టర్ ట్రైనర్లు చిన్నయ్య, ఖతిజిన్‌కుబ్రా, సూపరింటెండెంట్ ఆనంద్, డీటీ మైనుద్దీన్, నరసింహులు తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ధర్మవరం అర్బన్/కనగానపల్లి/రామగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం బసంత్‌కుమార్ జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మౌలిక వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ధర్మవరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల, నెహ్రూనగర్ మున్సిపల్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలతో పాటు కనగానపల్లి, రామగిరిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. 12వ తేదీ నాటికి కేంద్రాల్లో ఫర్నీచర్‌తోపాటు మౌలిక వసతులన్నీ కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై కూడా పోలీస్ సిబ్బందితో సమీక్షించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ తిప్పేనాయక్, తహసీల్దార్ యోగేశ్వరిదేవి, సెక్టోరియల్ అధికారి చెన్నవీరస్వామి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.